క్లుప్తంగా

పేద విద్యార్థి చదువుకు చేయూత



విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్

మొయినాబాద్: తండ్రిలేని పేద విద్యార్థి చదువుకు గాను రెడ్డిపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్ అండగా నిలుస్తున్నాడు. మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన కావలి శ్రీనివాస్ మూడు సంవత్సరాల క్రితం మరణించడంతో భార్య మహేశ్వరి తన కొడుకు సాకేత్‌ను చదివించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మోర శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సాకేత్ చదువుకు గాను ప్రతి సంవత్సరం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నాడు. అదే క్రమంలో శనివారం అతనికి రూ.10వేల నగదు అందజేశారు.

హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మించాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని ఎనికేపల్లిలో గోశాలకు కేటాయించిన భూముల్లో ఉన్న అతి పురాతన హనుమాన్ ఆలయాన్ని ప్రభుత్వం పునర్నిర్మించాలని బజరంగ్‌దళ్ కార్యకర్తలు విన్నవించారు. ఈ మేరకు శనివారం మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గోశాలకు కేటాయించిన భూముల్లోనే హనుమాన్ దేవాలయాన్ని నిర్మించాలని.. ఈ విషయాన్ని ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ మండల ప్రముఖ్ విజ యపాండు, కార్యకర్తలు శ్రీను, శివ కుమార్, సా యి బాలప్రాసన్న, సాయియాదవ్, విజయ్‌గౌ డ్, వికాస్, వంశీ, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించాలి

పశువైద్యురాలు శ్రావణి



దొంతాన్‌పల్లిలో టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రావణి

శంకర్‌పల్లి: పశువుల్లో వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన వైద్యం అందించాలని మహారాజ్‌పేట్ పశువైద్యురాలు శ్రావణి అన్నారు. శనివారం మండలంలోని దొంతాన్‌పల్లి, ప్రొద్దటూరు, కొండకల్ తండా, మియా ఖాన్‌గడ్డలలో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా సమీపంలోని పశువైద్యులను అడిగి, సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో 380 గొర్రెలు, 220 మేకలకు టీకాలు వేసినట్లు ఆమె స్పష్టం చేశారు.

ఉచిత వైద్య శిబిరం



కొండారెడ్డిపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో శనివారం ఎస్వీఎస్ ఆస్పత్రి మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో పల్లె బాలీశ్వర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 300ల మంది రోగులను పరీక్షించిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ భారత్‌నందన్‌రెడ్డి, గ్రామస్తులు లింగం, శ్రీనివాస్, నాగయ్య, కృష్ణయ్య, మల్లేశ్‌గౌడ్, రామోజీ, శంకరయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

నిత్యం వేలాది వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. కానీ అందుకు తగిన రహదారి విస్తరణ, ట్రాఫిక్, వేగ నియంత్రణ చర్యలు సరిగా లేవు. దీనికి తోడు ఫుట్‌పాత్ ఆక్రమణలతో ట్రాఫిక్ కష్టాలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు సకాలంతో గమ్యానికి చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. దీన్ని పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం, పోలీసులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జటిలమవుతోంది.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

- షాపుల ఎదుట చిరువ్యాపారాలు
- ఫొటోలు తీసి ఛలాన్లు వేయడానికే పరిమితమైన ట్రాఫిక్ పోలీసులు
- ఇబ్బంది ఎదుర్కొంటున్న వాహనదారులు, పాదాచారులు

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న మొయినాబాద్ మున్సిపాలిటీలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య జటిలమైంది. జాతీయ రహదారికి ఇరుపక్కలా వాణిజ్య సముదాయాలు(షాపులు) ఉన్నాయి. కానీ ఆ షాపుల ఎదుట మాత్రం సరైన పార్కింగ్ స్థలాలు లేవు. వాటి ఎదుట ఉండే కొద్దిపాటి స్థలాన్ని సైతం యజమానులు చిన్న చిన్న బండి కొట్లు పెట్టడానికి అద్దెకు ఇస్తున్నారు. దీంతో షాపులకు, బండి కొట్ల వద్దకు వచ్చినవారు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపి వెళ్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. అదేవిధంగా హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి అజీజ్‌నగర్ చౌరస్తా వరకు హోటళ్లు, గ్రానైట్, టైల్స్ షాపులు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా హోటళ్ల వద్ద వాహనాలకు సరిపడా పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.



రోడ్డు మధ్యలో నిలిపిన ఆర్టీసీ బస్సు

అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం

వ్యాపార సముదాయాలు, షాపులు, హోటళ్లకు మున్సిపల్ కార్యాలయం నుంచి నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎనిమిది నెలల క్రితం వరకు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలు జీపీలుగా ఉన్నాయి. అప్పట్లో పంచాయతీ అధికారులు ట్రేడ్ లైసెన్సులపై దృష్టి పెట్టకుండా మామూళ్లకు ఆశపడి ఇష్టానుసారంగా వదిలేశారు. దీంతో రహదారికి ఇరుపక్కలా ఉన్న షాపులు, వ్యాపార సముదాయాల ఎదుట ఖాళీ స్థలం ఎంత ఉంది. పార్కింగ్ స్థలం ఉందా అనే విషయాలను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో షాపుల ఎదుట ఉన్న స్థలాన్ని కబ్జా చేసి వాటిలో బండికొట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వారి వద్ద రోజు లెక్క అద్దెలు వసూలు చేస్తూ లక్షలు దండుకుంటున్నారు. షాపుల ఎదుట అక్రమంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. ఎనిమిది నెలలుగా మున్సిపాలిటీ అధికారులు సైతం అదే తరహాలో వ్యవహరిస్తున్నారు.

వీఐపీ రూట్‌గా ప్రకటించినా.. మారని పరిస్థితి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో హైదరాబాద్–బీజాపూర్ రహదారిని వీఐపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు. ముఖ్యమంత్రి కొడంగల్ వెళ్లాలంటే ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. అదేవిధంగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన నియోజకవర్గం వికారాబాద్‌కు వెళ్లాలనే ఇదే రూట్‌లో వెళ్లాలి. వారంలో రెండు మూడు సార్లు ఆయన వికారాబాద్ వెళ్లి వస్తూ ఉంటారు. అందుకే పోలీసులు వీఐపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు.కానీ అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ మాత్రం ఫొటోలు తీయడం,ఛలాన్లు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నారే తప్పా ఎక్కడైనా ట్రాఫిక్ నిలిచిపోతే పట్టించుకునే పరిస్థితి లేదు.ఇటీవలే మొయినాబాద్ ప్రాంతం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నుంచి చేవెళ్ల ట్రాఫిక్ పరిధిలోకి మారింది. ప్రస్తుతం చేవెళ్ల ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి అలాగే ఉంది.

బండికొట్లను తొలగించాలి

షాపుల ఎదుట చిరు వ్యా పారాలు నిర్వహిస్తుండడంతో వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ని త్యం ట్రాఫిక్ జామ్ అవు తోంది. ట్రాఫిక్ పోలీసులు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన చిన్న చిన్న బండికొట్లను తొలగించాలి. అవేమి చేయకుండా రోడ్లపైన ఆపిన వాహనాల ఫొటోలు తీసి ఛలాన్లు వేస్తున్నారు.

–ఫిరోజ్ , మొయినాబాద్

ఛలాన్లు వేస్తున్నాం

మొయినాబాద్‌లో షాపుల ఎదుట పార్కింగ్ స్థలం లేక రోడ్లపై నిలిపే వాహనాలకు ఛలాన్లు వేస్తున్నాం. షాపుల ఎదుట సామాన్లు పెట్టినా, బండి కొట్లు పెట్టినా వాటిని మున్సిపల్ అధికారులు తొలగించాల్సి ఉంటుంది. వాటితో మాకు సంబంధం లేదు. రోడ్లపై ఆగిన వాహనాలకు ఛలాన్లు వేయడమే మేం చేస్తాం.

– వెంకటేశం, ట్రాఫిక్ సీఐ, చేవెళ్ల

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: అత్యవసర పరిస్థితులు, ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందే పేదలు, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ఎంతో మేలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా కాంగ్రెస్ ప్రభుత్వం ఆపదలో ఉన్న వారికి చికిత్సల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. ఇప్పటికే ఆయా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన ఎంతో మంది పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే షాద్‌నగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మున్సిపాలిటీలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు శరవేగంగా జరగడం సంతోషకరమన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధిని స్వాగతించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, నర్సింలు, జగన్, మహేశ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న సుదర్శన్‌గౌడ్

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరు మాణయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కొమరబండలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రుణమాఫీ, గ్యాస్ సబ్సిడీ, మహిళా పింఛన్లు, రాజీవ్ యువశక్తి వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా మారిందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యకర్తలకు సలహాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రతి కార్యకర్త శ్రమిస్తే విజయాన్ని అందుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి హరీష్, గ్రామ బూత్ అధ్యక్షుడు భవదీశ్, నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 6, 7, 8, 9 వార్డుల్లో పర్యటించి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో ప్రధానంగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వార్డుల్లో అవసరం ఉన్నచోట ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. గత పాలకుల వైఫల్యాల కారణంగా వార్డుల వారీగా అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆరోపించారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, మురుగు కాలువల సమస్యలు మా దృష్టికి వచ్చాయన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుంటే ఆ సమస్యలకు అక్కడే పరిష్కార మార్గం లభిస్తుందన్నారు. అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడ కూడా వెనుకడుగు వేయడం లేదని, అందుకు అవసరమైన నిధులను సమకూర్చుతున్నారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్మికులకు దుస్తులు, ఇతర సామగ్రితో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అలీఖాన్‌బాబర్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ప్రవీణ్, విద్యుత్ శాఖ అధికారులు డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీ సత్యనారాయణ, పట్టణ ఏఈ వినోద్‌కుమార్, రూరల్ ఏఈ షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం పలువురు నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఉన్న సమస్యలపై విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. చేవెళ్ల డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించాలన్నారు. విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవటంతో కూడా విద్య కుంటుపడుతుందన్నారు. వెంటనే మంత్రిని కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్‌గౌడ్, మణిగౌడ్, ఎండీ అలీ, బంటి, తరుణ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

యూనివర్సిటీకి పరిశోధన గ్రంథం అందజేత



గ్రంథాన్ని అందజేస్తున్న ప్రభాకర్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన సంగెం ప్రభాకర్ 'ప్రమోటర్ మోటిఫ్ ఎనాలిసిస్ ఆఫ్ జీఎస్‌ఆర్‌హెచ్1 ఇన్ బోనీ ఫిషెస్' అనే అంశంపై శాస్త్రీయ కోణంలో పరిశోధన చేశారు. ఈ శాస్త్రీయ పరిశోధన గ్రంథాన్ని శనివారం ఆయ న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ జంతుశాస్త్ర విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ సెంథిల్‌కుమార్‌కు అందజేశారు. ప్రభాకర్ చేసిన పరిశోధన గ్రంథం విజ్ఞాన శాస్త్ర రంగానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వైస్ ఛాన్స్‌లర్ బీజే రావు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేయడంపై ప్రభాకర్‌ను అధ్యాపక బృందం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో సీటు



సొప్పరి నరేందర్

కేశంపేట: మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన సొప్పరి నరేందర్ హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో ఎంఏ(ఆంత్రోపాలజీ)లో సీటు సాధించాడు. దేశవ్యాప్తంగా నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా తనతో పాటుగా ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు నరేందర్ తెలిపారు. 1వ తరగతి నుంచి ఎంఏ వరకు ప్రభుత్వ బడుల్లోనే చదువుకున్నట్టు ఆయన తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన నరేందర్ ఉన్నత చదువులు అభ్యసించడంపై గ్రామస్తులు అభినందించారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



మొదళ్లగూడ శివారులో ఇలా..



చేగూరు రోడ్డు, హ్యాపీహోమ్ సమీపంలో ఇలా..

నందిగామ: మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై ఉన్న మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మలుపులతో ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. చంద్రాయాన్‌గూడ నుంచి మామిడిపల్లికి వెళ్లే దారిలో మొదళ్లగూడ సమీపంలో ఉన్న మూలమలుపు, చేగూరు నుంచి తిమ్మాపూర్‌కు వెళ్లే రహదారిలో హ్యాపీ హోమ్ వెంచర్ సమీపంలో వాగు వద్ద ఉన్న మూల మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డు మీదుగానే ప్రముఖ ధ్యాన కేంద్రం కన్హా శాంతి వనానికి వెళ్లే అభ్యాసీలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వారు రాకపోకలు కొనసాగిస్తుండటంతో నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇప్పటికే ఈ మలుపు వద్ద ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ మలుపు ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో టాన్స్‌కో వారు ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు అక్కడ పిల్లర్లతో కూడిన మిద్దెను ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మీదుగా ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలు పోయినట్లే. వెంకమ్మగూడ నుంచి సింబయోసిస్ యూనివర్సిటీకి వెళ్లే రహదారిని ఇటీవల రెండు వరుసలుగా నిర్మిస్తున్నారు. ఆ రోడ్డులో ఉన్న మూలమలుపు సైతం ప్రమాదకరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి

- సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

మొయినాబాద్: సాంకేతిక విద్యనభ్యసించిన ఇంజనీర్లు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయింట్ వ్యవస్థాపక చైర్మన్, బోర్డు సభ్యుడు బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 14వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులైన ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన 369 మంది గ్రాడ్యుయేట్స్‌కు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, సీఈఓ టీవీవీ పవన్‌కుమార్, కన్వీనర్ సౌమ్య సుచరిత సింహా పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పట్టభద్రులతో ముఖ్య అతిథులు

ఆగిన పనులు.. అవస్థల్లో విద్యార్థులు

- నిధుల లేమితో నిలిచిన అదనపు గదుల నిర్మాణం
- 4 రూమ్‌లు.. 8 తరగతుల నిర్వహణ
- కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



శిథిలమైన తరగతి గది



అసంపూర్తిగా ఉన్న నిర్మాణం

కేశంపేట: ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. మండల పరిధిలోని సంగెం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 117 మంది విద్యార్థులు 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్నారు. వీరికి 8 తరగతి గదులు అవసరం ఉన్నా.. నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్కో తరగతి గదిలో రెండు తరగతులను నిర్వహిస్తున్నారు. గతంలో 'మన ఊరు–మన బడి', జాతీయ ఉపాధి హామీ పథకంలో కలిపి రూ.88 లక్షలతో 5 తరగతి గదులు, కంపౌండ్ వాల్, కిచెన్ షెడ్ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి తరగతి గదుల నిర్మాణాలకు పిల్లర్ల వరకు పనులు చేశారు. అనంతరం బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశాడు. పాఠశాల ఆవరణలో బాత్‌రూం కూడా లేక ఇబ్బందులు పడుతున్నట్టు విద్యార్థినిలు తెలిపారు. ప్రస్తుతం నాలు గు తరగతి గదులకు ఒక గది కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో సౌకర్యాలతో పా టుగా తరగతి గదులను నిర్మించాలని విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయానికి శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయికృష్ణ సహకారంతో వాటర్ ట్యాంక్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై ఆలయ అధికారులకు ట్యాంక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. జీవితంలో ఇతరులకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి కలుగుతుందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు నీటి వసతిని కల్పిం చేందుకు వాటర్‌ట్యాంక్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రఘు, శరత్‌చంద్రబాబు, రాంచంద్రయ్య, నారాయణ, మురళీ, వంశీకృష్ణ, ఎలుకుర్తి శ్రీనివాస్, అశోక్, రమేశ్, అందె బాబయ్య, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి వాటర్ ట్యాంక్ అందజేస్తున్న సీఐ విజయ్‌కుమార్, నాయకులు